
# బుజ్జిగాడు

-చెలం



*(బుజ్జిగాడు అనే గోరింకపెట్టని అడ్డుపెట్టుకుని చెలం వెంట్రిలాక్విస్ట్‌లా అనేక సంగతులు చెప్పారు. 1958లో అరుణాచలంలో రాశారు. మారిపోతున్న మానవనైజం మీద ఎన్నో విసుర్లు. కసుర్లు ఇందులో వున్నాయి. చదివి ఆనందించి ఆలోచించండి)*

**బు**జ్జిగాడు పంచపాత్రలోంచి తప్ప నీళ్లు తాగడు. గిన్నెలతో పడితే అటునించి అటే వెళ్లిపోతాడు. పోనీ అని అతని కోసం ఓ యెర్రని ప్లాస్టిక్ టంబ్లర్ తీసుకొస్తే దాన్ని విసిరికొట్టాడు. తనని అవమానం చేసినట్టు. వాళ్లు తాగే టంబ్లర్‌లోనే తనూ తాగాలి.

మధ్యాహ్నం. షా 'చైనీస్ లిటరేచర్' అనే పత్రిక చదువుతోంది. అది కమ్యూనిస్టు ప్రాపగాండా పత్రిక. బుజ్జిగాడు మామూలు ప్రకారం యెగిరివొచ్చి కుర్చీ వెనక కూచుని షాని బిగ్గరగా చదవమని అడిగాడు. షా చదవగానే విని, యింక చదవొద్దని కోపంతో అరిచాడు. వినకపోతే ఆ పుస్తకాన్ని ముక్కుతో పొడిచాడు. ఓ పేజీని పట్టుకుని చింపడానికి సిద్ధమైనాడు. షా నవ్వి, ఆ పుస్తకాన్ని అవతల పెట్టి కబీరు గీతాల్ని, ఇంగ్లీషుని టాగూరు రాసినవి చదివి వినిపించింది. దానికీ అతడు యిష్టపడక అరిచాడు. ఇంగ్లీషులోని కబీర్ గీతాలలో కవిత్వం తక్కువ. ఆ కారణం వల్ల బుజ్జిగాడికి నచ్చలేదా? షేక్‌స్పియర్ చదివితే వూరుకున్నాడు. రీడర్స్ డైజెస్ట్ చదివినా యిష్టంలేదు. చైనీస్ లిటరేచర్ యిష్టంలేదు. ఎందువల్ల? వాటిల్లో డైరెక్ట్ ప్రాపగాండా లేదు. కథలూ, వ్యాసాలే.అతనికి యెందుకు విరోధమైనాయి?

ఆ పిట్ట రూపంలో ఏదో విద్వాంసుడి ఆత్మ వినవస్తోందా? ఆ భాషా, దాంట్లో అంతర్భాగంగా వుండే ప్రాపగాండా అతనికి తెలిశాయా? పిట్ట రూపమెత్తినా గొప్ప భాషాజ్ఞానం, పాండిత్యం అతని జ్ఞానంలో యిమిడి వుందా? లేక ఆ భాష స్పందనలు అతనికి బాధ కలిగించాయా? అట్లానే హిందీని భరించలేడు. ఆ భాష శబ్దం రుచించదా లేక ఏ జన్మలోనో హిందీ భాషా ద్వేషా? లేక ఏ హిందీ మనిషినో ద్వేషించాడా? ఆ మూలంగా హిందీ భాషని ద్వేషించి, ఆ ద్వేషాన్ని ఈ జన్మకి తెచ్చుకున్నాడా? ఆ అనంగీకారం యాక్సిడెంట్ అనుకుంటే హిందీలో ఏం చదవనీ, ఎప్పుడూ చదవనీ ఆతను తిరగబడతాడు.

ఒక్క మనిషికి తప్ప పశుపక్ష్యాదులకి తెలివి లేదనీ, అవి ఏం చేసినా అది 'ఇన్‌స్టింక్ట్' అనీ మానసిక శాస్త్రజ్ఞులు నిర్ణయించారు. ఎన్ని అద్భుతాలు చూసినా వాటిని గమనించరు.తమ థియరీలు మార్చుకోవలసి వొస్తుందని గావును. అవి అర్థంకావు. వాటికి తమ థియరీలతో సరిపుచ్చలేరు. ఇన్నాళ్లూ ఆవుల్ని చూస్తున్నారు. వాటిలో యెంత తెలివో?

అనాదిగా వొస్తున్న అలవాట్లని ఈ పశువులూ, పిట్టలూ మార్చుకుని అభివృద్ధి చెందలేదు కనక "ఇన్‌స్టింక్టే" గాని "ఇంటెలిజెన్స్" లేదని శాస్త్రజ్ఞుల వాదన. వాననీ భరించగలవు. వాటికి యిల్లు అనీ, ఆస్తి అనీ,

> బుజ్జిగాడు పంచపాత్రలోంచి తప్ప నీళ్లు తాగడు. గిన్నెలతో పడితే అటునించి అటే వెళ్లిపోతాడు. పోనీ అని అతని కోసం ఒక ప్లాస్టిక్ టంబ్లర్ తీసుకొస్తే దాన్ని విసిరి కొట్టాడు.

దానికి పన్నులనీ ఈ గొడవలేమీ లేవు. పిల్లలు పెద్దవి కాగానే గూటిని వదిలేసి యెగిరిపోతాయి. "ఇది మనది, ఇంకోరు తీసుకోకూడదు" అనే యేడుపు లేదు. ఈ గడ్డిగూళ్లు చాలు వాటి అవసరాలకి. వాటి జాతి నశించిపోవచ్చునట కొన్ని యుగాలకి. నశిస్తేనేం? ఏ జాతిని చిరకాలం నిలబెట్టుకుని నువ్వు యేమిటి సాధిస్తున్నావు? నానారకాల తిళ్లూ తినడంతో నీ అభివృద్ధి నిన్ను రోగాలలోకి దింపింది. పశుపక్షుల కన్నా అధికుడవా నువ్వు మానవుడా? ఎన్ని భయాలు? ఎన్ని ఈర్ష్యలు? పిచిక కోపం క్షణం వుంటుంది. దాని భయం క్షణం. చచ్చేరోజున చస్తుంది ఓ మూల. నీ గతి చూసుకుని నువ్వు బావురుమని యేడవ్వేం? ఈ జాతులు, సంస్కారాలు, రేస్ కల్చర్, నేషన్ ఎకనమిక్ బారియర్స్ అంటూ నువ్వు దినదినం చస్తున్న చావు - ఏమాత్రం భారమనిపించని దుర్గతిలో పడి, నీ ఆత్మని చంపే నీ నాగరికతని చూసుకుని గర్వపడుతున్నావా? తెల్లారి లేస్తే ఎట్లా సంపాయిద్దాం, యెట్లా యితరులకి లేకుండా నాకే దాచుకుందాం, భూమిలో ఎక్కడ ఏముందీ? గాలినీ, నీళ్లనీ, యెండనీ ఎట్లా వుపయోగంలోకి తెచ్చుకుందాం, ఎట్లా డబ్బు కింద మార్చుకుందాం. ఏ పిట్టల్ని తిందాం, ఏ చేపని తిందాం, ఆర్కిటిక్ సర్కిల్‌లో, సహారా ఎడారిలో, కాంగో అడవుల్లో, చంద్రుడిలో, బుధుడిలో ఏం రహస్యాలున్నాయో దోచుకుందామనే దృష్టి తప్ప - సుఖంగా కూచుని తెరిపిగా, ఏ తగాదా లేకుండా అనుభవించే శక్తి పోయిందే! పక్షులకన్నా పూర్వంగా పరిణామం చెందావా? వాటిది అలవాటా? నీది తెలివా? ■

## చైతన్య స్పృహ

ప్రపంచ వస్త్రాన్ని
ఏవో అజ్ఞాత హస్తాలు ఉతుకుంటాయి.
చీకటి మైల / పొరలు పొరలుగా
అంతర్ధానమైతున్న వేళ
చాయి-
బిందువులు బిందువులుగా
సముద్రంలో కలుస్తున్న వాన చినుకుల్లా
కడుపు కడలిలోకి జారుతుంటే
ఏ శివారెడ్డి కవిత్వమో / చాయికన్నా
చాయిలోని చక్కెరకన్నా మధురంగా వుండి
శివారెడ్డే చెప్పినట్టు / కవితను బిగ్గరగా
బైటికే చదువుతున్నప్పుడు
ఆ ఆనందమే వేరు.
అది, రైల్లో కిటికీ పక్కన కూర్చుని
ప్రకృతిని అనుభవిస్తున్నట్టుంటుంది.
ప్రాతఃకాల సూర్యుడు
తన కిరణాల కవితా చరణాలతో
లోకం మీదికి అడుగుపెడుతుంటే
కవిత్వాన్ని చేబూని / ప్రసిద్ధ కవి
వేదిక నెక్కుతున్నట్టే వుంటుంది
పొద్దుటి పూట
నీరులా ప్రవహించే లేత ఎండ
కవిత్వంలా మనోహరంగా వుంటుంది.
అది-
తనలా / లోకం మీదికి
కవిత్వంతో కదిలిపొమ్మని
చెవిలో గుసగుసలాడుతుంది.
పద్యం రాయమని పురిగొల్పుతుంది.
ఎండల రాయుడి సుందరాకారం చూడాలంటే
తొలి మలి సంధ్యల్లోనే సాధ్యం
మరిగిన ఎండ నీటిని సూర్యుడు
మన కళ్ళలోకి గుమ్మరించేటప్పుడు
సూర్యుడి కళ్ళల్లో కళ్ళుపెట్టి
అతని రూపాన్ని ఎటూ చూడలేవు.
సూర్య పద్మం వికసించడం చూడాలని
ప్రతి పొద్దూ / మొగ్గలు విచ్చుకుని
పూవులై-
దేవుని చూడ్డానికి గుడిముందు
నిల్చున్న భక్తుల్లా నిరీక్షిస్తుంటాయి.
పూవులై పుడమిపై పుట్టి
వెంటనే రాలిపోయేకన్నా
రోజూ సూర్య సౌందర్యం చూస్తూ
కొన్నాళ్ళయినా జీవించాలని
ఆకులు ఆరాటపడుతుంటాయి.
ఇంతటి మహదానందాన్ని వొదిలేసి
బద్ధకం దుప్పట్లు కప్పుకున్నవాడు
ఎప్పటికీ చైతన్యంతో చేయి కలపలేడు
లోకంపైకి వస్తున్న సూర్యుడికి
స్వాగతం పలికేందుకు / ఎదురెళ్ళేవాడి పురోగతిని
ఎప్పుడూ ఆపలేడు.

-మాధవీ సనారా